

మరో అడుగు

- డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

కేశవరావు ఇంటికి వస్తూనే తమ బెడ్ రూం వైపునించి వారి ముగ్గురి మాటలు వినిపించడంతో సరాసరి బెడ్ రూం లోకే వచ్చారు.

అక్కడనించి చూస్తుంటే ఉయ్యాలలో కూర్చున్న యశోదా, తల్లి పక్కనే ఆమెకి అతి దగ్గరగా కూర్చున్న యామిని, వారిద్దరికీ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్న యశ్ స్పష్టంగా కనిపిస్తున్నారు.

"హలో, మై లవ్ లీ ఫేమిలీ! అందరూ ఇక్కడే ఉన్నారా? చాలారోజులైంది అందరినీ ఇలా తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ చూసి! " చిన్నగా నవ్వుతూఅన్నారు.

“హాయ్ నాన్నా!” అంటూ పలకరించారు యష్, యామినీ.

భర్తని చూసి చిరునవ్వు నవ్వింది యశోద.

" ఇప్పుడే అనుకుంటున్నాం మీరు ఇంకా రాలేదేమిటా అని" అంది.

“మీటింగ్ కి గోయల్ రావడం కొద్దిగా లేట్ అయింది, అందువల్లే ఆలస్యం” అని, ఆ తర్వాత “ఒక్క నిమిషం!” అంటూ బెడ్ రూం లోకి వెళ్ళి, తన కోట్ తీసి వార్డ్ రోబ్ లో పెట్టి, మళ్ళీ వాళ్ళ దగ్గరికి వచ్చారు కేశవ.

" రండి నాన్నా, కూర్చోండి! రేపు చెయ్యబోయే ‘పెట్ స్కాన్’ గురించి అమ్మకేవో చిన్న సందేహాలుంటే అడుగుతోంది. దానిగురించే మాట్లాడుకుంటూ కూర్చున్నాం." అంది యామిని.

" భయం లేదు యశూ! ఏదైనా ఉంటే వీలైనంత తొందరగా తెలుసుకుంటే మంచిదనే కదా ఈ టెస్ట్ లు చేయించమనేది!" అన్నారు భార్య భుజం మీద చెయ్యి వేసి, అనునయంగా అన్నారు ఆయన.

పల్చగా నవ్వింది యశోద.

మసక వెన్నెల్లో మెత్తగా మెరిసిందామె నవ్వు. అది చూసి తేలిగ్గా నిట్టూర్చారు ఆయన.

యశోదకి నాలుగురాత్రుల కాలంలా అనిపించిన రాత్రి గడిచి తెల్లగా తెల్లవారింది.

స్నానాదికాలు ముగించి, దేవుడికి దండం పెట్టుకుని నుదిటిన కుంకుమ పెట్టుకుని తయారైంది యశోద.

పైకి ధైర్యం కూడగట్టుకున్నా, ఆమె మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలు, ఆందోళనలు.

'ఇది' అని చెప్పలేని అస్థిమితమైన మనస్థితిలోనే, భర్తా, పిల్లల్తో పాటు హాస్పటల్ లోకి అడుగుపెట్టింది యశోద.

ఆ డాక్టర్, క్లినిక్ లోని సిబ్బంది అందరూ బాగా తెలిసినవాళ్ళే కావడంతో అందరూ వీళ్ళని చూడగానే చిరునవ్వుతో ఆహ్వానించి కూర్చోబెట్టారు. డాక్టర్ కూడా వచ్చి ప్రత్యేకంగా పలకరించారు.

వాళ్ళు వచ్చిన పది నిమిషాలకి యశోదని లోపలకి తీసు కువెళ్ళి ' ట్రేసర్ ఇంజెక్షన్ ఐ.వీ' ద్వారా ఇచ్చారు.

అది ఇచ్చిన తర్వాత 30-60 నిమిషాలపాటు కదలకుండా, ప్రశాంతంగా కూర్చోవాలి, అప్పుడే ఆ ట్రేసర్ మందు శరీరంలోకి ఇంకుతుందని, స్కాన్ చేసినప్పుడు రిజల్ట్ బాగా తెలుస్తుంది అని చెప్పారు.

ఆ గంట ఎంతో భారంగా గడిచింది యశోదకి.

ఆ చల్లని ఏసీ రూములో కూర్చున్న ఆవిడకి 'నాకే ఎందుకు?' అన్న భావం ఎంత వద్దన్నా కలుగుతూనే ఉంది. అంతలోనే సర్దుకుని ' మనుషులకి కాకపోతేసమస్యలు ఇంకెవరికి వస్తాయి?' అని కూడా అనుకోసాగింది.

ఆ తర్వాత స్కానింగ్ మిషన్ దగ్గరకి తీసుకువెళ్ళారు.

టేబిల్ మీద పడుకోబెట్టాకా, ఆ టేబిల్ ని పెట్ స్కాన్ మిషన్ లోకి పంపారు. దాదాపు అరగంట సేపు ఆవిడకి రక రకాల కోణాల్లో ఫోటోలు తీసింది ఆ మిషన్.

అది జరుగుతున్నంతసేపూ కూడా ఆ ఫోటోలు తీస్తున్న చప్పుళ్ళేకాక, ఆ మిషన్ చేసే ఇతర రకాలైన ధ్వనులూ, మోటర్ లాంటిది నడుస్తున్న శబ్దాలూ, అన్నీ వినిపిస్తూనే ఉన్నాయి.

" కదలకుండా పదుకోవాలి, లేదంటే మిషన్ తీసే ఫోటోల్లో తేడా రావచ్చు" అని నర్స్ మరీ మరీ చెప్పడంవల్ల భయంతో మరింత కదలకుండా ఉండిపోయింది

స్కానింగ్ అయిపోయాకా కాసేపు రెస్ట్ తీసుకోమని చెప్పారు.

శరీరంలోకి వెళ్ళిన ట్రేసర్ తొందరగా బయటకు పోవడానికి బాగా నీళ్ళు, ఇతర పానీయాలు తాగుతూ ఉండమన్నారు.

అవన్నీ శ్రద్ధగా విని అందరూ ఇంటికొచ్చారు.

అసలు పరీక్ష కన్నా, అది కలిగించిన ఆదుర్దా వల్ల అలసిపోయింది యశోద. ఇంటికి రాగానే నిద్ర వస్తోందంటూ బెడ్ రూం వైపుకి నడిచింది.

" కొద్దిగా టిఫిన్ తినమ్మా " అని యామిని అంటే కూడా " వద్దురా! నిద్ర వస్తోంది, లేచాకా చూద్దాం" అంటూ బట్టలు మార్చుకుని, ఒక గ్లాస్ మంచినీళ్ళు తాగి నిద్రపోయింది.

మర్నాడు పిల్లలిద్దరూ తమ తమ విధులకి వెళ్ళిపోయాకా, యశోదా, కేశవరావులిద్దరూ మాత్రమే ఇంట్లో ఉన్నారు.

" ఐస్ క్రీం తిందామా?" ఉన్నట్టుండి అడిగింది యశోద

" ఇప్పుడా? సరే! ఫ్రిజ్ లో ఉంటుంది కదా! కరుణని తెమ్మంటాను" అన్నారు కేశవ

" ఫ్రిజ్ లోది కాదు, బయటకు వెళ్ళి తిందాం. చాలా రోజులైంది, మనిద్దరమే సరదాగా వెళ్ళాలని అనిపిస్తోంది" అంది యశోద.

" సరే! భోజనం చేశాకా వెళదామా?"

" రండి అయితే వెంటనే తినేసి వెళదాం. కరుణమ్మా! భోజనాలు పెడతావా?" అంటూ చురుకుగా డైనింగ్ రూమువైపుకు నడిచింది యశోద.

ఆవిడ వెళ్ళిన వైపు చిత్రంగా చూశారు కేశవరావు.

భోజనాలయ్యాకా, ఇద్దరూ కార్ లో బయలుదేరారు. కేశవే నడుపుతున్నారు. లేత పసుపు చీరలో, ఎంతో హుందాగా, అందంగా ఉన్న భార్య వైపు చిరునవ్వుతో చూశారు.

"చాలా రోజుల తర్వాత ఇవ్వాళ ఫ్రెష్ గా కనిపిస్తున్నావు యశూ, నిన్నిలా చూడడం ఎంతో బావుంది. నిన్నటి నిద్ర తో కాస్త రెస్ట్ దొరికినట్టుంది నీకు" అన్నారు.

యశోద కూడా చిరు నవ్వు నవ్వింది. ఆ తర్వాత చిన్న గొంతుతో మాట్లాడడం మొదలు పెట్టింది.

తమ పెళ్ళి అయిన కొత్త రోజుల గురించీ, తాము తిరిగిన ప్రదేశాల గురించి, తమ అనుభవాల గురించి, ఒక వరస అని కాకుండా, తనకేది గుర్తు వస్తే దాని గురించి మళ్ళీ మర్చిపోతానేమో అన్నట్టుగా చెప్తోంది.

" అప్పుడు ఏం జరిగిందో గుర్తుందా? మన యష్ చిన్నప్పుడిలా అయింది కదా!" ఇలా రకరకాల విషయాలు చెప్తూనే ఉంది.

ఈ మధ్య తరచుగా బాధ పెడుతున్న అనారోగ్యపు చిరాకులతో అలసిపోతున్న యశోద ఈరోజు అలా హుషారుగా, చలాకీగా కనిపిస్తూ కబుర్లు చెప్పడం ఆయనకి ఎంతో బావుంది. యశోద చెప్పిన కబుర్లన్నీ నవ్వుతూ విన్నారు ఆయన.

ఐస్ క్రీం షాప్ దగ్గరకి కారాపి " దిగుదామా?" అన్నారు.

" అప్పుడే వచ్చేశామా?" అంది యశోద నిరాశపడుతూ.

" చేరవలసిన స్థానం వచ్చింది కనక కార్ ఆపాలి, కబుర్లు ఆపక్కర్లేదు. నువ్వు మాట్లాడుతూనే ఉండచ్చు" ఆంటూ, నవ్వుతూ లోపలకి అడుగు పెట్టారాయన.

వెనకే యశోదా నడిచింది.

ఇద్దరికీ కావలసిన ఐస్ క్రీంలు తీసుకుని వచ్చారు కేశవ్ రావ్ గారు. గబ గబా తినేస్తే అయిపోతుందేమో అన్నట్టుగా, చిన్నపిల్లలా కొద్ది, కొద్దిగా తింటూ కబుర్లు కొనసాగించిందావిడ.

దాదాపు గంట గడిచిన తర్వాత

" ఇంక వెళదామా? మీటింగ్ ఉంది నాలుగింటికి" అన్నారు కేశవ్.

" సరే!" అంటూ లేచింది యశోద.

ఇద్దరూ ఇంటికి చేరిన అరగంటకి మీటింగ్ కోసం తయారయ్యి, బయలుదేరుదామనుకుంటూ ఉండగా ఆయన ఫోన్ గణ గణమంటూ మ్రోగింది.

ఎప్పుడూ సైలెంట్ లో ఉండే ఫోన్ ని, ఈ మధ్యనే మార్చి రింగ్ వినబడేలా పెట్టుకున్నారు. లేదంటే డాక్టర్లనించో, లేదా వారి ఆఫీసులనించో వచ్చే ఫోన్లు మిస్ అవుతానేమో అని.

రెండో రింగ్ కే ఫోన్ ఎత్తి మాట్లాడడం మొదలుపెట్టారు కేశవ్.

రెండు నిమిషాలసేపు మాట్లాడాక ' అలాగా! సరే! ఇప్పుడే వస్తాను!" అంటూ పక్కనే షెల్ఫ్ లో ఉన్న చిన్న నోట్ పాడ్ లో అవతలవాళ్ళు చెప్పిన మాటలని రాసుకున్నారు.

అది అయిన వెంటనే " తప్పకుండా డాక్టర్! అబ్బే లేట్ ఏమీ లేదు. ఇప్పుడే బయలుదేరుతున్నాను" అంటూ ఫోన్ పెట్టేశారు.

“డాక్టర్, ఇప్పుడే వస్తున్నాను, లేట్ లేదు” .. ఈ మాటలు కావల్సిన క్లూలని యశోదకి ఇవ్వనే ఇచ్చాయి.

“ ఏదో ఉంది!” మనసుకి చిన్న భయంవేసింది యశోదకి.

" ఏమిటండీ? ఎక్కడనించి ఫోన్? డాక్టర్ గారి దగ్గరనించేనా? ఏమంటున్నారు?" అందావిడ భర్త వైపు చూస్తూ.

ఆయనేమీ మాట్లాడలేదు ఒక్క క్షణం సేపు.

" టెస్ట్ రిజల్ట్ గురించే కదా మాట్లాడారు డాక్టర్ తో! ఏమన్నారు డాక్టర్? రిజల్ట్ లో ఏముందిట? దాచకుండా చెప్పండి? ఏముంది నా టెస్ట్ రిపోర్ట్లో? నాకేమైంది? ఆత్రుతగా అడిగింది.

మౌనంగా భార్యవైపు చూశారు కేశవ.

తను ఫోన్ లో విన్న విషయాన్ని ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేస్తున్న ఆయన 'ఆవిడకేం చెప్పాలి? ఎలా చెప్పాలి?' అన్న విషయం కూడా ఇంకా ఆలోచించలేదు. అందుకే ఏదే తేల్చుకోలేక పోతున్నట్టుగా ఉండిపోయారు.

ఏమీ తోచనప్పుడు మౌనమే బలం.

కానీ యశోద ఒక పట్టాన ఊరుకోలేకపోయింది.

" మనిద్దరి మధ్యా ఎప్పుడూ ఏ దాపరికం అన్నదే లేదు. ఇప్పుడు మాత్రం అది ఎందుకు మారాలి? దయచేసి ఏవిషయమూ దాచకండి. మంచైనా, చెడ్డైనా సరే మనం వినవల్సిందే, ఎదుర్కోవలసిందే. అందుకని దాచకుండా విషయమేమిటో చెప్పండి." అంది

యశోద ఇంత మాట్లాడుతున్నా కూడా కేశవరావ్ ఒక పట్టాన మాట్లాడలేకపోయారు. గుండె గొంతుకలోకి వచ్చినట్టయి, కళ్ళు నిండి పోయి మాటలే రాలేదు. వెంటనే బాత్ రూం లోకి వెళ్ళే వంకతో అటువైపుగా వెళ్ళిపోయారు.

తను అంత అడుగుతున్న కూడా ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయిన భర్త వైపే చూస్తూ ఉండిపోయింది యశోద.

లోపల, చల్లని నీళ్ళతో ముఖం కడుక్కుని, కంటి నీరు తుడుచుకుని, మనసుని కుదుటపరుచుకోవడానికి రెండు నిమిషాలు అక్కడే ఉండిపోయారు కేశవరావ్.

మనసుని స్వాంతనపరుచుకుని, చిక్కబట్టుకున్న చిన్నపాటి ధైర్యంతో నెమ్మదిగా బయటకు వచ్చి యశోద పక్కన మంచం మీద కూర్చున్నారు.

మెత్తటి ఆమె చేతిని, తన చేతిలోకి తీసుకుని కొన్ని క్షణాల పాటు నిమురుతూ ఉండిపోయారు.

" ఏమైంది? దయచేసి చెప్పండి!" అన్నట్టుగా ఆయన వైపు చూసింది యశోద.

చిన్నగా గొంతు సవరించుకుని నెమ్మదిగా చెప్పడానికుపక్రమించారాయన.

" యశూ! నేను చెప్పేది జాగ్రత్తగా విను. త్వరపడి మనం ఏదీ నిర్ధారించేసుకోకూడదు, సరేనా! " ఆ ట్యూమర్, అదే కణితి" అంటూ ఆమె ముఖాన్నే సూటిగా చూస్తూ క్షణం సేపు ఆగారు.

"ట్యూమరా?" అందావిడ భర్త చెప్పినది వింటూనే. చిన్నపాటి భయంతో కంపించిందామె గొంతు.

"మనం చిన్నది అనుకున్న కణితి పెద్దదేనని, అది, అది. కేన్సర్ కావచ్చని చెప్పారు డాక్టర్" అంటూ ఇంక చెప్పలేక ఆగిపోయారు.

యశోద ఏమీ మాట్లాడలేదు. భర్త చేతిమీద ఆమె చేతి పట్టు బిగియడంలోనే ఆమె మనస్థితి తెలుస్తోంది ఆయనకి.

" దాని అర్థం?!" అందావిడ ఆందోళన నిండిన గొంతుతో.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments